క్లుప్తంగా

భారీ ఫ్లెక్సీ ఏర్పాటు అడ్డగింత



యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్న భారీ ఫ్లెక్సీని పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. ఓ యువకుడి పుట్టిన రోజు వేడుకలకు సంబంధించి స్థానిక గడియారం స్థంబం వద్ద ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో ట్రాఫిక్ ఎస్సై సిబ్బందితో వచ్చి అడ్డుకుని ఫ్లెక్సీ వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. దీంతో ఆ యువకులు ఆ ఫ్లెక్సీని మరో ప్రదేశంలో ఏర్పాటు చేసుకోవడానికి వెళ్లిపోయారు.

పంచారామ క్షేత్రంలో రుద్రహోమం



రుద్రహోమం చేస్తున్న పండితులు

సామర్లకోట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో శుక్రవారం రుద్రహోమం నిర్వహించారు. క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని భక్తులు తెల్లవారు జామున ధ్వజ స్థంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. మహిళలు గోదావరి కాలువలో దీపాలను వదిలారు. ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి భక్తులు బిందెలలో కోనేరులో నీటితో అభిషేకాలు చేశారు. ఈఓ డి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

మాండవ్య నారాయణుని గ్రామోత్సవం

అతిపురాతన విష్ణు ఆలయమైన శ్రీ,భూ సమేత మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. కార్తిక క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పట్టణంలో ఊరేగించి తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు రఘురామ్, రవికుమార్ మాట్లాడుతూ రాత్రి గోదావరి కాలువ వద్ద స్వామికి కల్యాణం నిర్వహించి, తెప్పోత్సవంలో దీపాలు వెలిగించి వదిలారు.

అలరించిన జ్యోతిర్లింగార్చన

పంచారామ క్షేత్రమైన శ్రీబాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన ఎంతగానో అలరించింది. ఆలయంలో ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన ఆకాశ దీపానికి దవులూరి చారిటబుల్ ట్రస్ట్ అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు చేసి కార్తిక దీపం వెలిగించారు. అనంతరం ఆలయంలో కార్తిక దీపాలను వెలిగించారు. క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆలయంలో భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు.

బంగారు, వెండి పుష్పాలతో మరిడమ్మకు పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ద్వాదశి పూజల్లో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు.

చంద్ర పుల్లారెడ్డికి నివాళులు



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: విప్లవకారుడు చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని పులిమేరు దమ్ముపేటలో అమరవీరుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పాల్గొని పుల్లారెడ్డికి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఆభూములు పంజీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి జిల్లా కన్వీనర్ వడ్లమూరు మంగ, గుడాల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం తెలిపారు. గొల్లప్రోలు మండలంలోని చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, తాటిపర్తి, చిన జగ్గంపేట గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

జగన్‌తోనే పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- చిత్రాడలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పిఠాపురం: పేదల బతుకులు మారాలన్నా..వారి జీవితాల్లో వెలుగులు కొనసాగాలన్నా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమం పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన మా నమ్మకం నువ్వే జగనన్న ఫ్లెక్సీని ఆవిష్కరించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను, ఏపీకి జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన గ్రామంలో పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ కర్రి దుర్గా ప్రసాద్, వులవల భూషణం, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నడిగట్ల చింతలరావు తదితరులు పాల్గొన్నారు.



చిత్రాడలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు, నాయకులు

పథకాలతో ప్రజలకు మేలు : దవులూరి

సామర్లకోట: సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలం పీబీ దేవం గ్రామంలో ఆయన వై ఏపీ నీడ్స్ జగన్‌లో పాల్గొన్నారు. సంక్షేమంతోనే అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతును రాజుగా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికలల్లో 175 స్థానాల్లో విజయ ఢంకా మోగించడం ఖాయమని దొరబాబు దీమా వ్యక్తం చేశారు. పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వారి వరకు అనేక పథకాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. జగన్‌ను ఎదుర్కొన లేక ఇతర పార్టీలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆయన ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాల బాబు, ఉప సర్పంచ్ మలకల సత్య, జేసీఎస్ మండల కన్వీనర్ ఉటా వాసు, సచివాలయ కార్యదర్శుల, వలంటీర్లు, పార్టీ నాయకులు తోటకూర గంగాధర్, తోటకూర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను దొరబాబు అందజేశారు.



లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న దవులూరి దొరబాబు

సంక్షేమంలో రాష్ట్రం అగ్రస్థానం

మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ

సామర్లకోట: సంక్షేమ పథకాలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో ఉన్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా శుక్రవారం నీలమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని జగన్ అమలు చేస్తున్న పథకాలపై ప్రజలల్లో వస్తున్న ఆదరణ చూచి అనేక రాష్ట్రాలలో జరుగుతున్న ఎన్నికల్లో ఈ పథకాలపై హామీలు ఇస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీల్లో 99.9 శాతం అమలు చేసిన ఏకైక సీఎం జగన్ అని తెలిపారు. అటువంటి వ్యక్తి తిరిగి సీఎంగా బాధ్యతలు స్వీకరించడానికి స్థానిక నాయకుడైన దవులూరి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు. సచివాలయ పరిధిలోని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగుర వేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, కౌన్సిలర్లు స్వయంభారపు వీరభద్ర రావు, చిట్టుమాని రాఘవ, నమ్మి దుర్గా భవానీ, ఎస్ సురేష్, జెసీపీ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగన్ ఎంతో అవసరం

పెద్దాపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జరుపుతున్న సంక్షేమం, అభివృద్ధి పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని జి.రాగంపేట సచివాలయ పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఒక్కరూ గుర్తించి మరోసారి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసి మరింత లబ్ధి పొందాలని అన్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, బండారు వీరబాబు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేల సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. ఎంపీటీసీ అనురాధ, వడ్డి కాసులు, తిరుమలరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరిస్తున్న దొరబాబు

తిరుపతి అన్నదాన భవన నిర్మాణానికి శంకుస్థాపన

పెద్దాపురం: తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయంలో అన్నదాన సత్రం భవన నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చారు. ఆలయ ప్రాంగణంలో సుమారు అరున్నర సెంట్ల స్థలాన్ని దాత పెద్దింటి పురుషోత్తమాచార్యులు రెండేళ్ల కిందట దేవదాయ శాఖకు ఆలయ అవసరాల నిమిత్తం దానం చేశారు. ఆ స్థలంలో శుక్రవారం దాత, స్థానిక సైరస్ ఇండస్ట్రీ అధినేత బండా వెంకట కృష్ణారావు, పద్మావతి దంపతులు సుమారు 30 లక్షలతో భవన సముదాయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, చైర్మన్ కర్రి వెంకట రామ జగదీశ్వరరావుల సమక్షంలో భూమిపూజ చేశారు. ఆలయ మర్యాదలతో దాతలకు స్వాగతం పలుకగా అర్చకుడు ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దాత, కృష్ణారావు దంపతులు

వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం కెనాల్ రోడ్డులో కొలువై ఉన్న వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం చిల్కు ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేకలు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు, భజన, సంగీత కచేరీలు నిర్వహించారు.

రబీ సాగు వేగంగా ప్రారంభించాలి

సామర్లకోట: రబీ పనులు వేగంగా ప్రారంభించాలని వ్యవసాయశాఖ, రిలయన్స్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా ఆటో ప్రచారం ప్రారంభించారు. గోదావరి కాలువలో నీటి మట్టం తక్కువగా ఉండటం వలన మార్చి 31 నాటికి గోదావరి కాలువ మూసివేసే అవకాశం ఉన్నదని, దీనిని దృష్టిలో ఉంచుకొని సాగు పనులు ప్రారంభించాలని మండల పరిధిలో ఆయా గ్రామాల్లో రైతులకు అర్థమయ్యేలా ప్రచారం చేశారు. బొండాలను సాగు చేసుకునే వారు డిసెంబరు 5 లోపు ఊడ్పులు పూర్తి చేయాలన్నారు. రైతులు ఎంటీయూ 1121, ఎంటీయూ 1153 రకాలను వేసుకోవడం ద్వారా పంట సమయం తగ్గించుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ఏఈఓలు ఎంపీ సతీష్, శాంతికమల, రిలయన్స్ తరపున నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏడాది పాటు అయ్యప్ప దీక్ష

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ఓరుగంటి సత్యనారాయణ, లక్ష్మి దంపతులు 365 రోజులు పాటు నిర్విరామంగా కఠిన నియమాలతో అయ్యప్ప దీక్ష పూర్తి చేసుకుని శుక్రవారం శబరిమలకు పయనమయ్యారు. ఈ సందర్భంగా వారిని స్థానిక అయ్యప్ప భక్తులు ఘనంగా సత్కరించి శబరిమల యాత్రకు సాగనంపారు. కఠిన నియమాలతో ఏడాది పాటు దీక్ష చేసే అవకాశం స్వామి అయ్యప్ప కల్పించడంతో తమ జన్మ ధన్యమైందని దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

పెద్దాపురం: ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ ద్వారా వసతి కల్పిస్తోందని హౌసింగ్ చైర్మన్ దవులూరి అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టే తాగునీటి పథకానికి ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయన స్థానిక ఆర్బీకేను పరిశీలించి ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరు, రైతులకు అందుతున్న సేవలపై వ్యవసాయ సహాయకురాలు చిలకమ్మను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, సొసైటీ అధ్యక్షులు నల్లల నాగేంద్రబాబు, పరిమి శ్రీను, పుట్టా వెంకట్రావు, ముత్యాల రాజబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కోటిపల్లి సత్యలక్ష్మి కుటుంబ సభ్యులకు శుక్రవారం హౌసింగ్ చైర్మన్ దవులూరి దొరబాబు వైఎస్సార్ బీమా చెక్కు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు ప్రమాద సమయంలో ఆపద్బంధువులా ఆదుకునే వైఎస్సార్ బీమా కుటుంబ సభ్యులకు ఆసరగా నిలుస్తుందని దొరబాబు అన్నారు. అనంతరం సుమారు రూ.4.9 లక్షల నగదును మృతురాలు సత్య కుమార్తె దుర్గకు ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ చెక్కు అందజేశారు. కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ తదితరులున్నారు.



ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న దవులూరి దొరబాబు

పేదల భూములకు సంపూర్ణ హక్కులు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: నిరు పేదల భూములకు ప్రభుత్వం సంపూర్ణ హక్కులు కల్పించిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం నియోజకవర్గంలో అసైన్డ్ భూములకు భూ బదలాయింపు హక్కులు కల్పిస్తూ ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పేదలకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలో 35 ఎకరాల భూమిపై 47 మంది లబ్ధిదారులకు హక్కులు కల్పిస్తూ సంపూర్ణ హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2003లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని పలువురు లబ్ధిదారులు కలిసి తమకు ప్రభుత్వం భూమి ఇచ్చినా పండించుకోడానికి తప్ప ఏ అవసరాలకూ ఉపయోగపడడం లేదని, భూమిపై హక్కులు కల్పించారని కోరారన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ భూమిపై హక్కుల కల్పనకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ఆయన తనయుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అవసరాలను గుర్తించి వారి భూములకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, మొగలి బాబ్జి, తహసీల్దార్లు జీవీఎస్ ప్రసాద్, ఆర్‌వీ వెంకటేశ్వరరావు, పితాని త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు సంపూర్ణ భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం గురువారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా వేణుగోపాలస్వామి మహిళా భక్త సమాజం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకరించి గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పండితులు ఆలయ మండపంలో స్వామి వారి దివ్య కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దివ్య కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణ మూర్తి, ఆలయ అర్చకులు విజయజనార్దనాచార్యులు, మాధవ మణికంఠాచార్యులు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నవర సొసైటీలో ఆప్కాబ్ తనిఖీలు

సామర్లకోట: ప్రాథమిక సహకార సంఘాల తనిఖీలో భాగంగా విజయవాడకు చెందిన ఆప్కాబ్ అధికారులు శుక్రవారం పవర గ్రామంలో ఉన్న నవర పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. సంఘం సభ్యుల సంఖ్య, దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక రుణాలతో పాటు బంగారం తనఖా రుణాల రికార్డులను పరిశీలించారు. రుణ రికవరీలను సైతం అడిగి తెలుసుకున్నారు. ఏపీ కోపరేటివ్ బ్యాంకు జీఎం సీహెచ్‌కేవీ కృష్ణారావు, జిల్లా జీఎం వి.రాజీవ్‌బాబు, ఏజీఎం జి. బాపూజీ, డీసీసీబీ జీఎం పి.ప్రవీణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, సొసైటీ సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు, డైరెక్టర్ నాగనబోయిన రాజబాబు, పీఏసీఎస్ బ్రాంచి మేనేజరు పి.మహేష్ కుమార్, సూపర్‌వైజరు కె.నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన కామేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



నవర సొసైటీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పాదగయకు కార్తిక శోభ

- కార్తిక పౌర్ణమి పూజలకు భారీగా ఏర్పాట్లు
- పుష్కరిని వద్ద ప్రత్యేక క్యూలైన్లు
- లక్ష మంది భక్తులు దర్శించుకుంటారని అంచనా



పిఠాపురం: పవిత్ర కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఆలయాలు దేదీప్యమానంగా దర్శనమిస్తున్నారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా ఆదివారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. సుమారు లక్ష మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వస్తారనే అంచనాలతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచే భక్తులు పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేసి ఉమాకుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో పాదగయ పుష్కరిణిని శుభ్రం చేయడంతో పాటు క్యూలైన్లు పటిష్టం చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వామివారి దర్శనం అయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్తిక పౌర్ణమి వ్రతాలు ఆచరించిన భక్తులు ఉదయం, సాయంత్రం కూడా ఆలయానికి వచ్చే అవకాశం ఉండడంతో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం రాత్రి కుక్కుటేశ్వరస్వామి జోలా తోరణం నిర్వహించనున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

పౌర్ణమి రోజు స్వామి వారికి లక్షపత్రి పూజ, అభిషేకాలు, మంత్రపుష్పాలు, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆదివారంతో పాటు సోమవారం సైతం ఎక్కువ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులందరికీ దర్శనం కల్పించడంతో పాటు అన్నప్రసాదాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– వి.శ్రీనివాసరావు, ఈఓ, పాదగయ క్షేత్రం

ఆదివారమే పౌర్ణమి

కార్తిక పౌర్ణమిపై తగులు, మిగులు అంటూ భక్తులకు పలు అనుమానాలు ఉన్నాయి. భక్తులు అపోహలు వీడి ఆదివారం నాడే కార్తిక పౌర్ణమి జరుపుకోవాలి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ మాత్రమే పౌర్ణమి గడియలు ఉంటాయి. రాత్రి అంతా ఉండే నిండు పౌర్ణమి కేవలం 26వ తేదీన మాత్రమే ఉంటుంది. సోమవారం రాత్రి పౌర్ణమి గడియలు లేవు. కనుక నిండు పౌర్ణమి ఉండే ఆదివారం మాత్రమే పూజలు చేసుకోవాలి. ఎవరు ఎటవంటి అపోహలకు గురికాకుండా శాస్త్ర ప్రకారం ఆదివారమే పౌర్ణమి పూజలు చేసుకోవాలి.

– ఆకొండి ప్రభాకరశాస్త్రి, అపర్ణాదేవి ఆలయ అర్చకులు, తాటిపర్తి

ఆధ్యాత్మికతకు చిహ్నం కార్తికం

ఉప్పువారి సత్రం వద్ద కార్తిక వన సమారాధన

సామర్లకోట: కార్తిక మాసం ఆధ్యాత్మికతకు చిహ్నమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాచఉసిరి చెట్టుకు పూజలు చేసి అనంతరం వన సమారాధనలో పాల్గొన్నారు. సత్రం వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పు సత్యనారాయణ కుటుంబ సభ్యులు సత్రం ఆవరణలో కార్తిక క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకొని పూర్వికుల చిత్ర పటాలకు పూజలు చేశారు. సుమారు 10 వేల మంది కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసేన కన్వీనర్ తుమ్మల బాబు, భారతమాత సేవాపరిషత్ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఉసిరిచెట్టుకు, పెద్దలకు పూజలు చేస్తున్న ఉప్పువారి కుటుంబ సభ్యులు